# ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక



## రిపోర్టర్లు కావలెను
అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.
ప్రభాత ఉదయం తెలుగు దినపత్రిక
సంప్రదించండి
ఫోన్: 93910 89608



సంపుటి: 3 | సంచిక: 321 | పేజీలు: 6 | వెల: రూ.3/- | ఆదివారం 1 మార్చి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి


## కాకినాడ జిల్లా వేట్లపాలెంలో
# మృత్యు విస్ఫోటం

**20 మంది సజీవ దహనం.. 11 మందికి తీవ్ర గాయాలు**

**కాకినాడ జిల్లా వేట్లపాలెం వద్ద భగ్గుమన్న బాణసంచా గోడౌన్**

**ఆ సమయంలో మందు గుండు తయారీలో 30-40 మంది వరకు కూలీల నిమగ్నం**

**చెవులు చిల్లులు పడేలా ఏకధాటిగా రెండు గంటలపాటు పేలుళ్లు**

**20-30 అడుగుల ఎత్తున ఎగిరిపడ్డ తలలు.. కాళ్లు.. చేతులు.. మొండేలు**



**కాకినాడ, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

కాకినాడ జిల్లా సామర్లకోట మండలం వేట్లపాలెంలో శనివారం పెను విషాదం చోటుచేసుకుంది. ఇక్కడి బాణసంచా తయారీ కేంద్రంలో భారీ విస్ఫోటం జరిగి 20 మంది సజీవ దహనమయ్యారు. తీవ్ర గాయాలపాలైన మరో పది మందిని కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రి (జీజీహెచ్)కి తరలించారు. మధ్యాహ్నం 2 గంటల సమయంలో ఈ ఘోర దుర్ఘటన చోటుచేసుకుంది. పేలుళ్ల ధాటికి అందులో పనిచేస్తున్న కార్మికుల శరీర భాగాలు చెల్లాచెదురైపోయాయి. కాళ్లు, చేతులు తెగి సమీపంలో ఉన్న చెట్లపై పడడంతో ఆ ప్రాంతమంతా భీతావహ పరిస్థితి నెలకొంది. చనిపోయిందెవరో గుర్తుపట్టలేనంతగా మృతదేహాలున్నాయి. ప్రమాదం ..మిగతా 2లో



## దేశవ్యాప్తంగా మొదలైన
# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్

**అజ్‌మేర్‌లో ప్రారంభించిన ప్రధాని మోదీ**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

దేశవ్యాప్తంగా హెచ్‌పీవీ టీకా కార్యక్రమం ప్రారంభమైంది. శనివారం రాజస్థాన్‌లోని అజ్‌మేర్‌లో ప్రధాని నరేంద్రమోదీ దీనిని ప్రారంభించారు. మహిళల్లో గర్భాశయ ముఖద్వార క్యాన్సర్‌తో పాటు, నివారించదగిన మరికొన్ని రకాల క్యాన్సర్లను అరికట్టడమే లక్ష్యంగా కేంద్రం ఈ కార్యక్రమాన్ని చేపట్టింది. ముఖ్యంగా హ్యూమన్ ప్యాపిలోమావైరస్(హెచ్‌పీవీ)ని ఇది అరికడుతుంది. ఇందులోభాగంగా 14 సంవత్సరాల బాలికలకు సింగిల్ డోస్ 'గార్డాసిల్-4' అనే టీకాను ఆరోగ్య కేంద్రాల్లో ఉచితంగా పంపిణీ చేస్తున్నారు. ఈ వ్యాక్సిన్ హెచ్‌పీవీ టైప్ 16, 18తో పాటు టైప్ 6, 11 రకాల నుంచి రక్షణ కల్పించనున్నట్లు కేంద్రం తెలిపింది. అజ్‌మేర్‌లో కాంగ్రెస్‌పై మోదీ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ఇండియన్ నేషనల్ కాంగ్రెస్(ఐఎన్‌సీ) ఇప్పుడు ముస్లిం లీగ్-మావోయిస్టు కాంగ్రెస్‌గా మారిందని విమర్శించారు. ముస్లిం లీగ్‌కు భారత్‌పై ఉన్న ద్వేషమే నాడు విభజనకు కారణమైందని, ఇప్పుడు కాంగ్రెస్ కూడా అదే విధంగా వ్యవహరిస్తోందన్నారు. ఏఐ సదస్సులో కాంగ్రెస్ యువజన విభాగం చేసిన అర్ధనగ్న నిరసనపై మాట్లాడుతూ..ఈ వ్యాఖ్యలు చేశారు. దేశాన్ని కించపరచడానికి దొరికిన ఏ అవకాశాన్నీ కాంగ్రెస్ వదులుకోదని మండిపడ్డారు. ప్రపంచం భారత్‌ని ప్రశంసించినప్పుడు, భారతీయులంతా గర్వపడితే.. కాంగ్రెస్ మాత్రం దేశాన్ని కించపరిచే ప్రయత్నాలు చేస్తుంటుందన్నారు. దేశవ్యాప్త ఎన్నికల్లో కాంగ్రెస్ వరుసగా ఓడిపోతూ వస్తోందని, అందుకే దేశాన్ని దిగజార్చే ప్రయత్నాలు చేస్తూ ప్రతీకారం తీర్చుకుంటోందని మోదీ అన్నారు.



# హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్

**కింగ్ కోఠి ఆస్పత్రిలో ప్రారంభించిన మంత్రి దామోదర**

**ఆడపిల్లలను క్యాన్సర్ బారినుంచి రక్షించే ప్రక్రియ**

**తల్లిదండ్రులు ఇందుకు ముందుకు రావాలన్న మంత్రి దామోదర**

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

హైదరాబాద్ కింగ్ కోఠి హాస్పిటల్‌లో హెచ్‌పీవీ వ్యాక్సినేషన్ డ్రైవ్‌ను ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ శనివారం ప్రారంభించారు. వ్యాక్సిన్ వేయించుకున్న బాలికలకు మంత్రి వ్యాక్సినేషన్ సర్టిఫికెట్లను అందజేసారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ అనిల్ కుమార్ యాదవ్ పాల్గొన్నారు. నేటి నుంచి 3 నెలల వరకూ వ్యాక్సినేషన్ కార్యక్రమం కొనసాగనున్నది. తొలి నెల రోజుల వరకూ ప్రభుత్వ జనరల్ హాస్పిటళ్లు, ఏరియా హాస్పిటళ్లు, కమ్యునిటీ హెల్త్ సెంటర్లలో అందుబాటులో వ్యాక్సినేషన్ ఉండనున్నది.. తర్వాత ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లోనూ అందుబాటులోకి రానున్నది. ఈ సందర్భంగా మంత్రి దామోదర మాట్లాడుతూ ఈ రోజు మనం ఆరోగ్య రంగంలో ఒక చారిత్రాత్మక ఘట్టాన్ని ఆవిష్కరించుకున్నాం అన్నారు. ఆడబిడ్డల ఆరోగ్యాన్ని కాపాడేందుకు ఒక బృహత్తర కార్యక్రమానికి శ్రీకారం చుట్టుకున్నాం అన్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్లు, కాలుష్యం వంటి అనేక కారణాల వల్ల దేశవ్యాప్తంగా క్యాన్సర్ మహమ్మారి కోరలు చాస్తోంది.దురదృష్టవశాత్తు, మన రాష్ట్రంలో కూడా ఏటా 55,000 నుండి 60,000 క్యాన్సర్ కేసులు నమోదవుతున్నాయి. రాబోయే ఐదేళ్లలో ఈ సంఖ్య మరో 10శాతం పెరుగుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఈ ప్రమాదాన్ని ఎదుర్కోవడానికి మన ప్రభుత్వం ఒక సమగ్ర క్యాన్సర్ పాలసీని రూపొందించింది. కేన్సర్ వైద్య సేవలు కేవలం హైదరాబాద్ కే పరిమితం కాకుండా, ములుగు, ఆదిలాబాద్ వంటి మారుమూల జిల్లాల్లో కూడా ఇప్పుడు కీమోథెరపీ సేవలను అందుబాటులోకి తీసుకొచ్చాం. ప్రతి జిల్లాలో డే కేర్ క్యాన్సర్ సెంటర్లను ఏర్పాటు చేశాం.

## మదీనా బస్సు ప్రమాద మృతులకు
# ప్రభుత్వం ఆర్థిక సాయం

**44 మందికి 5 లక్షల చొప్పున సాయం అందచేత**

**సచివాలయంలో బాధిత కుటుంబాలకు నేరుగా చెక్కులు**

**ప్రభుత్వం అండగా ఉంటుందని చెప్పిన సిఎం రేవంత్**



**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన వారి కుటుంబాలకు సీఎం రేవంత్‌రెడ్డి పరిహారం పంపిణీ చేశారు. 44 మంది మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం పంపిణీ చేశారు. గాయపడిన వారికి రూ.3 లక్షల చొప్పున సాయం అందజేశారు. గతేడాది నవంబర్ 17న మక్కా యాత్రలో జరిగిన బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవదహనమైన విషయం తెలిసిందే. మక్కా నుంచి బయలుదేరిన బస్సు ముందు వెళ్తున్న డీజిల్ ట్యాంకర్‌ను ఢీకొనడంతో ఈ ప్రమాదం జరిగింది. దీంతో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. బస్సు ప్రమాదంలో 44 మంది హైదరాబాద్ వాసులు సజీవ దహనమైన విషయం తెలిసిందే. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌రెడ్డి సచివాలయంలో మీడియాతో మాట్లాడారు. మదీనా ప్రమాదం గురించి తెలియగానే సహాయ చర్యలపైన కేంద్ర ప్రభుత్వంతో మాట్లాడానని ..మిగతా 2లో



# ఇరాన్‌పై బాంబుల వర్షం

**సురక్షిత ప్రాంతానికి ఖమేనీ తరలింపు**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్తంగా యుద్ధం మొదలుపెట్టాయి. 'ఆపరేషన్ షీల్డ్ ఆఫ్ జూడా' పేరుతో ఇజ్రాయెల్ క్షిపణులు, బాంబులతో ఇరాన్ రాజధాని టెహ్రాన్‌పై శనివారంనాడు విరుచుకుపడింది. ఇరాన్ సుప్రీం లీడర్ అయతొల్లా ఖమేనీ కార్యాలయం సమీపంలో దాడులు జరిగాయి. ఖమేనీ, అధ్యక్ష భవనాలే టార్గెట్‌గా ఈ మెరుపు దాడులు జరిగినట్టు చెబుతున్నారు. దాడుల

## విద్యారంగ అభ్యున్నతికి
# ఒక్క సిఫార్స్ ఏదీ

**ఆ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలి**

**టీచరల్ జీతలు తగ్గించాలని సూచిస్తారా**

**సిఎం రేవంత్ తీరుపై మండిపడ్డ బండి సంజయ్**

**హైదరాబాద్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**



ఇటీవల సిఎం రేవంత్‌కు సమర్పించిన విద్యా కమిషన్ రిపోర్టును చెత్తబుట్టలో వేయాలని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ ఎద్దేవా చేశారు. విద్యారంగ అభ్యున్నతి కోసం సిఫారసులేవని ప్రశ్నించారు. టీచర్ల జీతాలను తగ్గించాలని చెప్పడం సిగ్గుచేటని ..మిగతా 2లో

### సైబరాబాద్ కమిషనరేట్ హోంగార్డ్స్ సంఘం ఆధ్వర్యంలో

# ఆర్ఎస్ఐ కిషన్ నాయక్‌కు వీడ్కోలు సన్మానం

## నూతనంగా హోంగార్డ్ ఆర్గనైజేషన్ బాధ్యతలు చేపట్టిన ఆర్ఎస్ఐ నయీమ్‌కు స్వాగతం

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీ నేపథ్యంలో పరేడ్ గ్రౌండ్‌లో అభినందన కార్యక్రమం సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని హోంగార్డ్స్ ఆర్గనైజేషన్‌లో గత నాలుగు సంవత్సరాలుగా హోంగార్డ్స్ సంక్షేమం కోసం కృషి చేసిన ఆర్ఎస్ఐ కిషన్ నాయక్ కు ఘన సన్మానం నిర్వహించారు. బాలానగర్ ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు బదిలీపై వెళ్లిన సందర్భంగా హోంగార్డ్స్ సంఘం ఆధ్వర్యంలో హెచ్ఏఎల్ బాలానగర్ పరేడ్ గ్రౌండ్‌లో ఈ కార్యక్రమం వైభవంగా జరిగింది. హోంగార్డ్స్ సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లడంలో, వారి సంక్షేమం కోసం నిరంతరం కృషి చేయడంలో కిషన్ నాయక్ విశేష పాత్ర పోషించారని సంఘ ప్రతినిధులు పేర్కొన్నారు. సేవాభావం తో పని చేసి హోంగార్డ్స్‌కు అండగా నిలిచిన ఆయన సేవలను స్మరించుకుంటూ పుష్పగుచ్ఛాలు, శాలువాలతో ఘనంగా సన్మానించారు.



అదేవిధంగా, నూతనంగా హోంగార్డ్ ఆర్గనైజేషన్ బాధ్యతలు చేపట్టిన ఆర్ఎస్ఐ నయీమ్ కు స్వాగతం పలుకుతూ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. భవిష్యత్తులో హోంగార్డ్స్ సంక్షేమం మరింత బలోపేతం అవుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మేడ్చల్ బాలానగర్ జోన్ ఇంచార్జి హెడ్ కానిస్టేబుల్ వసంత రెడ్డి ని కూడా సన్మానించారు. హోంగార్డ్స్ సేవలు శాంతిభద్రతల పరిరక్షణలో కీలకమని, వారి సమస్యల పరిష్కారానికి సంఘం కట్టుబడి ఉందని నేతలు స్పష్టం చేశారు. కార్యక్రమంలో రాష్ట్ర హోంగార్డు ఉపాధ్యక్షుడు అశోక్, సైబరాబాద్ హోంగార్డ్స్ ఏఎస్ఎన్ మూర్తి, బి. గోపాల్, మన్మధరావు, లక్ష్మణ్, శర్మ, నరేష్, బుచ్చయ్య, లక్ష్మీనారాయణ, సంగన్న తదితరులు పాల్గొన్నారు. పెద్ద సంఖ్యలో హోంగార్డ్స్ హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. హోంగార్డ్స్ సంక్షేమం కోసం కృషి చేసిన అధికారులను గౌరవించడం ద్వారా సంఘం ఐక్యతను చాటిందని పాల్గొన్నవారు అభిప్రాయపడ్డారు. ఈ సన్మాన కార్యక్రమం హోంగార్డ్స్‌లో నూతనోత్సాహాన్ని నింపింది.

# అవసరం ఉన్నప్పుడు పదవీ విరమణ చేసిన పోలీసుల సేవ వినియోగించుకుంటాం

## సైబరాబాద్ సీపీ డాక్టర్ రమేష్

**శేరిలింగంపల్లి ఫిబ్రవరి 28, (ప్రభాత ఉదయం)**

అవసరం ఉన్నప్పుడు పదవీ విరమణ చేసిన పోలీసు అధికారుల సేవలను వినియోగించుకుంటామని సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఎం. రమేష్ అన్నారు. సైబరాబాద్ పోలీస్ కమిషనరేట్ ఆడిటోరియంలో పదవీ విరమణ పొందిన కార్యక్రమం ఘనంగా జరిగింది. పదవీ వీరమణ చేసిన పోలీసు సిబ్బందిని సీపీ ఘనంగా సన్మానించారు. పదవీ విరమణ చేసిన వారిలో చందానగర్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఎస్ఐ గణపురం శ్యామ్ ప్రసాద్, గచ్చిబౌలి పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కె. నాగేశ్వర్ రెడ్డి, గచ్చిబౌలి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్‌కు చెందిన ఏఎస్ఐ కొండా సత్యనారాయణ గౌడ్, సీఏఆర్ హెడ్‌క్వార్టర్స్‌కు చెందిన ఏఆర్ హెడ్ కానిస్టేబుల్ చిర్రా సత్యనారాయణ ఉన్నారు. ఈ సందర్భంగా సైబరాబాద్ సీపీ మాట్లాడుతూ పోలీస్ శాఖలో నిస్వార్థ సేవలు అందించి పదవీ విరమణ పొందుతున్న అధికారుల అనుభవాలను పంచుకోవడం సంతోషంగా ఉందన్నారు. విధి నిర్వహణలో పోలీసులు


పదవీ విరమణ చేసిన పోలీసు అధికారులతో సీపీ రమేష్

చేసే త్యాగాల వెనుక వారి కుటుంబ సభ్యుల పాత్ర వెలకట్టలేనిదన్నారు. భవిష్యత్తులో పోలీస్ శాఖకు అవసరమైనప్పుడు రిటైర్డ్ ఉద్యోగులు వారి సేవలు అందించేందుకు సిద్ధంగా ఉండాలని కోరారు. ఈ కార్యక్రమంలో అడ్మిన్ డీసీపీ టి. అన్నపూర్ణ, అడ్మిన్ ఏడీసీపీ ఎఫ్. రెహ్మాన్, సీఏఆర్ హెడ్ క్వార్టర్స్ ఏడీసీపీ షమీర్, సీఏఓ అకౌంట్స్ వెంకట్ రెడ్డి, ఏఓ అడ్మిన్ జ్యోతిర్మణి, ఎస్టేట్ ఆఫీసర్ ఆర్ఐ హిమకర్, సైబరాబాద్ పోలీస్ సహకార సంఘం ఇన్ చార్జ్ జి. మల్లేశం తదితరులు పాల్గొన్నారు.

### మక్కా యాత్రలో బస్సు ప్రమాద

# కుటుంబాలకు ఆర్థిక సాయం

మొదటి పేజీ తరువాయి...

ప్రస్తావించారు. మంత్రి అజారుద్దీన్‌ను వెంటనే మదీనా పంపించానుని గుర్తుచేశారు. బాధిత కుటుంబాలకు రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని మంత్రివర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నామని తెలిపారు. దేశం బయట జరిగే ప్రమాదాలకు ప్రభుత్వాలు పరిహారం చెల్లించదని.. కానీ బాధితుల కుటుంబాల పరిస్థితి చూసి సహాయం ప్రకటించామని అన్నారు. నాంపల్లి అగ్నిప్రమాదంలో చనిపోయిన వారి కుటుంబాలను కూడా ఆదుకున్నామని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం అండగా ఉంటుందనే నమ్మకాన్ని ప్రజకు కలిగించామని చెప్పుకొచ్చారు. అందుకే కుటుంబాలను సెక్రటేరియట్‌కి పిలిచి పరిహారం అందించామని వివరించారు. ఇది ప్రజల ప్రభుత్వమని.. ఆందోళన చెందొద్దని అన్నారు. ప్రజల కష్టం, ఆనందంలో మీతో ఉంటుందని ధైర్యం చెప్పారు. ఈ ప్రభుత్వం మీది.. ఎటువంటి ఆందోళన చెందాల్సిన పని లేదు.. మీకు అండగా ఉంటామంటూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. మదీనాలోప్రమాదఘటన తెలుసుకున్న వెంటనే మంత్రి అజహరుద్దీన్ నేతృత్వంలోని ప్రతినిధి బృందాన్ని మదీనాకుపంపామని సీఎం గుర్తు చేశారు. చనిపోయిన వారి



కుటుంబ సభ్యులకుతక్షణమే పాస్‌పోర్టులు, వీసాలు ఇప్పించి మదీనాపంపించామన్నారు. అక్కడిభారత్ కాన్సులేట్, సౌదీ ప్రభుత్వంతో చర్చించి మృతిచెందిన వారి అంత్యక్రియలు జన్నుతుల్బఖీలోచేయించామన్నారు. ఈ చెక్కులను ఇళ్లకు పంపించవచ్చని.. కానీ మీ అందరితోకలవాలని... మీకు అండగాఉంటామనే భరోసాకల్పించాలనే ఉద్దేశంతోనే సచివాలయానికి పిలిపించామని సీఎం అన్నారు. ముస్లిం సోదరులతో తనకున్న అనుబంధాన్ని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ సందర్భంగా గుర్తు చేసుకున్నారు. తాను కొడంగల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన 2009సంవత్సరం నుంచి నియోజకవర్గంలోని అయిదు మండలాల నుంచి ఒకొక్కరి చొప్పున ఏటా అయిదుగురిని తన సొంత ఖర్చులతో హజ్ యాత్రకుపంపుతున్నానని సీఎం తెలిపారు. వారిని ఎంపిక చేసే బాధ్యత స్థానిక ముస్లిం మతపెద్దలకేఅప్పజెప్పానన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అజారుద్దీన్, ముఖ్యమంత్రి సలహాదారు వేంనరేందర్ రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, నాంపల్లి ఎమ్మెల్యే మాజీద్ హుస్సేన్, హజ్కమిటీఛైర్మన్ ఖుస్రో పాషా, తెలంగాణ మైనారిటీస్ రెసిడెన్షియల్ ఎడ్యుకేషనల్ఇన్‌స్టిట్యూషన్స్ సొసైటీ వైస్ ఛైర్మన్ఫహీంఖురేషి, రాష్ట్ర మైనార్టీ ÷నాన్స్ కార్పొరేషన్ ఛైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.ఈ నెల ముస్లింలకు చాలా పవిత్రమైనదని..అంతా కలిసి మెలిసి ముందుకెళ్దామని పిలుపునిచ్చారు.



# ఇరాన్‌పై బాంబుల వర్షం

మొదటి పేజీ తరువాయి...

సమయంలో ఖమేనీ టెహ్రాన్‌లో లేరని తెలుస్తోంది. ఇప్పటికే ఆయనను సురక్షిత ప్రాంతానికి తరలించినట్టు చెబుతున్నారు. అయితే ఆయనను ఎక్కడకు తరలించారు, ఎప్పుడు తరలించారనే వివరాలు వెల్లడి కాలేదు. ఖమేని ఇరాన్ వదిలి వెళ్లాలని, లేదంటే విడిచిపెట్టేది లేదని ట్రంప్ ఇప్పటికే హెచ్చరించారు. దీంతో ఖమేనీ లక్ష్యంగానే అమెరికా-ఇజ్రాయెల్ సంయుక్త దాడులు మొదలుపెట్టినట్టు కథనాలు వెలువడుతున్నాయి. ఇరాన్‌పై అమెరికా బలగాలు పెద్దఎత్తున సైనిక చర్యకు దిగినట్టు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రకటించారు. ఇందుకు సంబంధించిన 8 నిమిషాల వీడియోను ట్రంప్ తన ట్రూత్ సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. వాషింగ్టన్ సైనిక చర్యను ఆయన సమర్థించుకున్నారు. ఇరాన్ పాలకుల నుంచి అమెరికా ప్రజలకు ఉన్న ముప్పును తప్పించేందుకే సైనిక చర్యలకు దిగామన్నారు. ఇరాన్ కార్యక్రమాలు అమెరికాకు, అమెరికా బలగాలకు, విదేశాల్లోని తమ స్థావరాలు, ప్రపంచంలోని తమ మిత్రదేశాలకు ముప్పుగా ఉన్నాయన్నారు. మరోవైపు, ఇజ్రాయెల్‌పై ఇరాన్ ప్రతీకార దాడులు చేపట్టింది. ఇజ్రాయెల్‌తో పాటు పశ్చిమాసియాలోని అమెరికా సైనిక స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్టు తెలుస్తోంది. యూఏఈ, కువైట్, ఖతర్‌లలో పేలుళ్లు వినిపించినట్టు అంతర్జాతీయ మీడియాలో కథనాలు వెలువడుతున్నాయి. బహ్రెయిన్‌లోని అమెరికా నేవీ 5వ ఫ్లీట్‌పై క్షిపణి దాడి జరిపినట్టు ఆ దేశం ధ్రువీకరించింది. ఇరాన్ ఉద్రిక్తతల నేపథ్యంలో బహ్రెయిన్ బేస్ నుంచి ఇప్పటికే తమ నౌకలను అమెరికా నేవీ ఉపసంహరించుకున్నట్టు చెబుతున్నారు. ఖతర్ రెండు ఇరాన్ క్షిపణులను అడ్డుకున్నట్టు తెలుస్తోంది.

### ఇరాన్‌పై యుద్ధంతో

# క్రూడ్ ఆయిల్‌కు కొరత

## భారీగా ధరలు పెరిగే అవకాశం ఉందని వెల్లడి

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

ఇజ్రాయెల్ మధ్య యుద్ధం ముదురుతుండటంతో ప్రపంచవ్యాప్తంగా క్రూడ్ ఆయిల్ సెగలు రేగుతున్నాయి. ఈ యుద్ధం కారణంగా అంతర్జాతీయ మార్కెట్‌లో ముడిచమురు ధరలు ఒక్కసారిగా పరుగులు తీయడం ప్రారంభించాయి. శుక్రవారం నాటి ట్రేడింగ్‌లోనే బ్రెంట్ క్రూడ్ ధర 2? మేర పెరిగి, బ్యారెల్‌కు 72.48 డాలర్ల వద్ద స్థిరపడింది. యుద్ధం గనుక మరిన్ని రోజులు కొనసాగితే.. ఈ ధర బ్యారెల్‌కు 80 డాలర్ల మార్కును దాటుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. దిగుమతులపై ఆధారపడిన భారతదేశంలోని సామాన్యుడి జేబుకు చిల్లు పెట్టేలా పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదలకు కారణం కానుంది. ముఖ్యంగా అంతర్జాతీయ వాణిజ్యానికి అత్యంత కీలకమైన హోర్ముజ్ జలసంధిపై ఇప్పుడు అందరి దృష్టి నెలకొంది. ఇరాన్ ఉత్తరాన.. ఒమన్, యూఏఈ, దక్షిణాన ఉన్న ఈ సన్నని సముద్ర మార్గం ప్రపంచ చమురు సరఫరాకు గుండెకాయ లాంటిది. ప్రపంచవ్యాప్తంగా ఉత్పత్తి అయ్యే క్రూడ్, దాదాపు 20 నుంచి 30 శాతం ఈ మార్గం గుండానే రవాణా అవుతుంది. ఒకవేళ ఇజ్రాయెల్ దాడులకు నిరసనగా ఇరాన్ ఈ జలసంధిని దిగ్బంధిస్తే.. ప్రపంచ ఇంధన మార్కెట్ కుప్పకూలే ప్రమాదం ఉంది. రోజుకు దాదాపు 2 కోట్ల బ్యారెళ్ల చమురు ఈ మార్గం ద్వారానే సరఫరా అవుతుండటంతో.. సప్లై చైన్ తెగిపోయి పెట్రో ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయం. భారత్ విషయానికి వస్తే.. మన దేశానికి అవసరమైన క్రూడ్ లో దాదాపు 60-70 శాతం పశ్చిమ ఆసియా దేశాల నుండే వస్తోంది. ప్రస్తుతం భారత్ ఇరాన్ నుంచి నేరుగా చమురు దిగుమతి చేసుకోకపోయినప్పటికీ.. సౌదీ అరేబియా నుంచి 13-17?, ఇరాక్ నుంచి 24?, యూఏఈ వంటి దేశాలపై ఎక్కువగా ఆధారపడుతోంది. ఈ దేశాలన్నీ చమురు రవాణాకు హోర్ముజ్ జలసంధినే వాడుతుంటాయి. ఈ నేపథ్యంలో అక్కడ యుద్ధ వాతావరణం నెలకొంటే.. రవాణా ఖర్చులు, ఇన్సూరెన్స్ ప్రీమియంలు పెరిగి దేశీయంగా పెట్రోల్, డీజిల్ లీటరు ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందని తెలుస్తోంది. ఇప్పటికే ద్రవ్యోల్బణంతో ఇబ్బంది పడుతున్న సామాన్యులకు, ఇంధన ధరల పెంపు నిత్యావసర వస్తువుల రేట్లను భారీగా పెంచేస్తుందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం అమెరికా తన క్షిపణి దాడులను ఇరాన్ సైనిక స్థావరాలకే పరిమితం చేసినప్పటికీ.. ఇరాన్ గనుక ఆర్థికపరమైన ఒత్తిడి తెచ్చేందుకు చమురు సరఫరాను అడ్డుకుంటే పరిస్థితి చేయిదాటిపోతుంది. దాదాపు 500 బిలియన్ డాలర్ల విలువైన క్రూడ్ ట్రేడ్ ఈ చిన్న సముద్ర మార్గంపైనే ఆధారపడి ఉంది. ఇరాన్ తన సైనిక బలగాలను హోర్ముజ్ ప్రాంతంలో మోహరించడం అంతర్జాతీయ సమాజాన్ని ఆందోళనకు గురిచేస్తోంది. చమురు ధరల పెరుగుదల వల్ల కలిగే ఆర్థిక నష్టాన్ని తగ్గించేందుకు భారత్ వంటి దేశాలు వ్యూహాత్మక చమురు నిల్వలను సిద్ధం చేసుకోవాల్సిన అత్యవసర పరిస్థితి ఏర్పడింది. ఈ ఉద్రిక్తతలు ఎన్ని రోజుల్లో తగ్గుతాయనే అంశంపై సందిగ్ధత కొనసాగుతున్న వేళ వాహనదారులు కూడా రేట్లు పెరగటానికి ముందే ఫుల్ ట్యాంక్ చేయించుకుంటే మంచిదని భావిస్తున్నారు.

### విద్యారంగ అభ్యున్నతికి

# ఒక్క సిఫార్స్ ఏదీ

మొదటి పేజీ తరువాయి...

అన్నారు. ఈ మేరకు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డిపై బండి సంజయ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.విద్యావేత్తలు లేని విద్యా కమిషన్ ఇదని విమర్శించారు. శనివారం హైదరాబాద్‌లోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో మీడియాతో బండి సంజయ్ మాట్లాడారు. అర్బన్ నక్సలైట్ ఆధ్వర్యంలో వేసిన కమిషన్‌కు విలువేముందని నిలదీశారు. విద్యాశాఖకు మంత్రి లేరనే విషయాన్ని కూడా గుర్తించని కమిషన్ ఎందుకని బండి సంజయ్ ప్రశ్నల వర్షం కురిపించారు. చాక్ పీసులకు పైసల్లేక, స్కావెంజర్లు లేక స్కూళ్లు అల్లాడుతుంటే పరిష్కార మార్గాలు చూపరా..? అని ఫైర్ అయ్యారు. కనీస ఉత్తీర్ణత మార్కులను 35 నుంచి 45కు పెంచడం దుర్మార్గమని అన్నారు. పేద విద్యార్థులు స్కూల్ స్థాయిలోనే ఫెయిలై ఉన్నత విద్యకు దూరమయ్యే ప్రమాదం ఉందని హెచ్చరించారు. విద్యావేత్తలు, ఉపాధ్యాయ సంఘాలతో, విద్యార్థుల తల్లిదండ్రుల అభిప్రాయాలను తీసుకోకుండా రూపొందించిన ఏకపక్ష నివేదిక ఇదని ధ్వజమెత్తారు.ఉపాధ్యాయులను విద్యా కమిషన్ అవమానించిందని బండి సంజయ్ మండిపడ్డారు. స్థానిక పరిస్థితులను పట్టించుకోకుండా విదేశాల్లో తిరిగి నివేదిక ఇస్తే ఒరిగేదేముంది..? అని ప్రశ్నల వర్షం కురిపించారు. ఉపాధ్యాయులారా...మీకు అండగా బీజేపీ ఉంటుందని భరోసా కల్పించారు. ఇళ్ల కూల్చివేతలో రేవంత్‌రెడ్డికి గిన్నిస్ రికార్డు ఖాయమని ఎద్దేవా చేశారు. మావోయిస్టుల విషయంలో రేవంత్‌రెడ్డిది ద్వంద్వ వైఖరి అని ఆగ్రహించారు. అర్బన్ నక్సలైట్లను కమిటీల్లో వేస్తారని... లొంగిపోయిన మాజీలను ప్రోత్సహిస్తున్నారని బండి సంజయ్ దుయ్యబట్టారు.

# కాకినాడ జిల్లా వేట్లపాలెంలో మృత్యు విస్ఫోటం

మొదటి పేజీ తరువాయి...

జరిగిన వెంటనే అగ్నిమాపక సిబ్బంది, పోలీసులు, స్థానికులు ఘటనా స్థలానికి చేరుకున్నారు. 70 శాతానికిపైగా కాలిన గాయాలతో ఉన్న 9 మందిని జీజీహెచ్‌కు, మరొకరిని ప్రైవేటు ఆసుపత్రికి తరలించారు. వారందరి పరిస్థితీ విషమంగానే ఉంది.

**పేలుడు జరిగిన రేకులషెడ్**

ఘటనా స్థలంలో పనిచేస్తున్న వ్యక్తులు బయటకు రాలేక కళ్లముందే కాలిపోతున్నా వారిని కాపాడే పరిస్థితి లేకపోయింది. ఒక్కపక్క ఎగసిపడుతున్న మంటలు, మరోవైపు భారీ పొగతో ఏం జరుగుతుందో, మంటల్లో ఎంతమంది ఉన్నారో అంచనా వేయలేని స్థితి నెలకొంది. అగ్నిమాపక సిబ్బంది మంటలను కొంతమేర అదుపులోకి తెచ్చిన తరువాత తీవ్రగాయాలతో కొట్టుమిట్టాడుతున్న 10 మందిని గుర్తించి అంబులెన్స్‌ల్లో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. బాణసంచా ముడిసరకు నిల్వలు భారీ ఎత్తున ఉండటంతో మంటలు సుమారు రెండుగంటలకు పైగా మండుతూనే ఉన్నాయి. ఆ ప్రదేశం మొత్తం పొగ కమ్మేయడం, వరుస పేలుళ్లతో అసలు ఏం జరుగుతుందో తెలియనంత గందరగోళం నెలకొంది.

**గాల్లో ఎగిరిపడ్డ శరీర భాగాలు**

పేలుడు ధాటికి అక్కడ పనిచేస్తున్న పలువురి శరీర భాగాలు గాలిలో ఎగిరిపడ్డాయి. ఒక మహిళ పుర్రె భాగం పేలిపోయింది. మరో మృతదేహం పేలిపోయి మాంసం ముద్దగా పక్కనే ఉన్న పొలంలో ఎగిరిపడింది. మరో వ్యక్తి మృతదేహం సుమారు 50 మీటర్ల దూరం ఎగిరి పక్కనే ఉన్న పంట కాలువలో పడిపోయింది. శరీర భాగాలు ఛిద్రమయ్యాయి. ఘటనా స్థలంలో కాళ్లూ, చేతులూ, ఇతర శరీరభాగాలు విడిపోయి, చెల్లాచెదురుగా పడి ఉండడంతో భీతావహ వాతావరణం నెలకొంది. ఇంతటి దారుణం ఎప్పుడూ చూడలేదని స్థానికులు విలవిల్లాడిపోయారు.

**మృతదేహాల కోసం పొలాల్లో వెతుకులాట**

సుమారు ఎకరన్నర ప్రాంతంలో ఉన్న బాణసంచా తయారీ కేంద్రంలో మృతదేహాలు చెల్లాచెదురుగా పడిఉన్నాయి. షెడ్లలో పని చేసేవారు అక్కడకక్కడే చనిపోయి కాలిపోయి పడి ఉండగా మరికొందరు గాయాలతో ప్రాణాలను కాపాడుకునే ప్రయత్నంలో పంట పొలాల వెంట పరుగులు తీశారు. కొందరు పొలాల్లోనే కుప్పకూలి మృతి చెందారు. చనిపోయింది ఎవరో తెలియడానికి, వారి మృతదేహాలు ఎక్కడ ఉన్నాయో వెతుక్కోవడానికే సాయంత్రమైంది. పంట పొలాలు, కాలువలు, ఘటనా స్థలంలో ఉన్న మృతదేహాలన్నీ ఒకచోటకు చేర్చారు. 20 మంది మృతి చెందారని అధికారులు ప్రాథమికంగా నిర్ధారించారు.

**పచ్చని పొలాల్లో భారీ పేలుడు**

వేట్లపాలేనికి సమీపంలోని పంట పొలాల మధ్య సూర్యశ్రీ ఫైర్ వర్క్స్ పేరుతో కొన్నేళ్లుగా బాణసంచా తయారీ కేంద్రం నిర్వహిస్తున్నారు. స్థానికులు టపాసుల తయారీ పనులు చేస్తుండగా మధ్యాహ్నం 2 గంటల వేళ భారీ పేలుడు చోటుచేసుకుంది. ఆ శబ్దానికి సమీప గ్రామాల్లో ఇళ్లు కంపించాయి. పైకప్పు పెంకులు ఎగిరిపడ్డాయి. ఇళ్లలో సీలింగ్‌లు ఊడిపడ్డాయి. ఐదు కిలోమీటర్ల దూరంలోని సామర్లకోట, పెద్దాపురం ప్రజలకూ శబ్దాలు వినిపించాయంటే పేలుళ్ల తీవ్రత ఏ స్థాయిలో ఉందో అర్థమవుతోంది.

# ఆలోచింప చేసిన విద్యార్థుల ప్రదర్శనలు



సోలిటైర్ గ్లోబల్ స్కూల్ లో విద్యార్థులు చేసిన ప్రదర్శనలను తిలకిస్తున్న వర్కాల రాధిక


వైజ్ఞానిక ప్రదర్శన లో....

**బుద్వేల్, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం)**

బాబుల్ రెడ్డినగర్ లోని సోలిటైర్ గ్లోబల్ స్కూల్ లో శనివారం ఏర్పాటు చేసిన విధ్యా వైజ్ఞానిక ప్రదర్శన తల్లిదండ్రులను, చూపరులను ఎంతగానో ఆకట్టుకుంది. చిన్నారులు చేసిన పలు ప్రదర్శనలు తల్లితండ్రులను ఆలోచింప చేసేవిగా ఉన్నాయి. పాఠశాలకు చెందిన 5వ తరగతి విద్యార్థి శ్రేయాన్ వర్కాల బృందం రూపొందించిన వాటర్ హార్వేస్టింగ్ సిస్టమ్ ప్రదర్శన అందరిని ఆలోచింపచేసింది. రాబోయే రోజులలో నీటి ఇబ్బందులు ఎక్కువయ్యే ప్రమాదం ఉందని, ప్రతి ఒక్కరు వర్షం నీటిని భూమిలో ఇంకింపచేయడానికి ప్రతి ఇంటి ఆవరణలో వాటర్ హార్వేస్టింగ్ పిట్స్ ఏర్పాటు చేసుకోవాలన్నారు. మరో విద్యార్థి హార్దిక్ బృందం రూపొందించిన అడవుల పరిరక్షణ ప్రదర్శన చూపరులను, విద్యార్థుల తల్లితండ్రులను ఎంతగానో ఆకట్టుకుంది. అడవుల తో నే మానవ మనుగడ సాధ్యమని చెబుతు వారు చేపట్టిన ప్రదర్శన అందరిని ఆకట్టుకుంది. చెట్లు వర్షాలు సమృద్ధిగా కురవడానికి ఉపయోగ పడుతాయని, కాగితం తయారీలో, కలప, మందుల తయారీ లో చెట్లు ఎంతో ఉపయోగకరంగా ఉంటాయన్నారు. ముఖ్యంగా మానవులకు ఆక్సిజన్ అందజేయడంలో చెట్టు ప్రధాన పాత్ర పోషిస్తాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

**విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసేందుకు వైజ్ఞానిక ప్రదర్శనలు: ప్రిన్సిపాల్ అనిల్ వసంత్**

విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికి తీయడానికి వైజ్ఞానిక ప్రదర్శనలు ఎంతగానో తోడ్పడతాయని సోలిటైర్ గ్లోబల్ స్కూల్ ప్రిన్సిపాల్ అనిల్ వసంత్ అన్నారు.

శనివారం కాటేదాన్ సోలిటైర్ గ్లోబల్ స్కూల్ లోవిద్యార్థిని, విద్యార్థుల్లో శాస్త్రీయ నైపుణ్యం పెంపొందించడంతోపాటు సమాజానికి ఉపయోగపడే ఎన్నో ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. ఈ ప్రదర్శనలను విద్యార్థుల







తల్లి తండ్రులు తిలకించి వాటి ఉపయోగాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. బ్లడ్ గ్రూప్స్, షుగర్ టెస్ట్, హైట్ వంటి పరీక్షలు విద్యార్థులు ఉచితంగా చేశారు. ఈ సందర్బంగా ప్రిన్సిపల్ మాట్లాడుతూ...చిన్ననాటి పరిశోధనలే భవిష్యత్తులో గొప్ప ఆవిష్కరణలకు పునాది అని, పిల్లల ప్రతిభను గుర్తించి తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు. విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను పెంపొందించుకో వాలన్నారు. ఏ అంశంలోనైనా ప్రయోగాత్మకంగా అధ్యయనం చేయడం నేర్చుకోవాలన్నారు. సమాజంలో మారుతున్న కాలానికి అనుగుణంగా మెరుగైన సమాజం కోసం ఎటువంటి ప్రాజెక్టులు అవసరం అనేది విద్యార్ధి దశనుంచి అలవర్చుకోవడం ద్వారా మెరుగైన సమాజం ఏర్పాటులో భాగస్వాములు అయ్యేందుకు వీలుగా ఉంటుందన్నారు. సైన్స్ ద్వారానే మెరుగైన సమాజం ఏర్పడుతుందని విద్యార్ధుల ప్రదర్శనలు నిరూపించాయన్నారు. పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులను భావి శాస్త్రవేత్తలుగా మార్చేందుకు ఈ వైజ్ఞానిక ప్రదర్శన ఎంతో ఉపయోగపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. వైజ్ఞానిక ప్రదర్శనలో విద్యార్థులు రూపొందించిన వర్షం నీటి సంరక్షణ, రోబోటిక్స్, సాంకేతిక కళ, వాయు కాలుష్య నియంత్రణ, సోలార్ సిస్టం, నానో టెక్నాలజీ, అటవీ పర్యావరణ వ్యవస్థ, ప్రతిబింబం ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ అముక్త రెడ్డి, ఉపాధ్యాయులు మల్లేష్, అర్జున్,విశాల్, ఖాజా, సుజాత రావు, రూబీనా, సరిత తివారి, ఉమా ఐరా, రిజ్వి,లలిత, వైష్ణవి, మాధవి, రహమాత్, ఆఫ్సార్, అమృత, బబితా, మౌనిక, సునీత, లక్ష్మి,హారతి, హుమేరా, సాన ఖాన్ తదితరులు పాల్గొన్నారు.


పట్లోళ్ల కార్తీక్ రెడ్డి


శీలం తిరుపతి రెడ్డి

## రాజేంద్రనగర్‌లో నేడు కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలు

**బుద్వేల్, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం)**

మార్చి 1వ తేదీన ఉదయం 12:30 గంటలకు గగన్ పహాడ్ లో బీ ఆర్ ఎస్ రాజేంద్రనగర్ నియోజకవర్గం ఇంచార్జీ పి కార్తీక్ రెడ్డి జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించడానికి సిద్ధమవుతున్నారు. బీ ఆర్ ఎస్ నేత శీలం తిరుపతి రెడ్డి ఆధ్వర్యంలో శివాలయం లో ప్రత్యేక పూజలు నిర్వహించనున్నట్లు శీలం తిరుపతి రెడ్డి తెలిపారు. అనంతరం స్థానిక గోశాల ను సందర్శించి గో పూజలు చేయడం జరుగుతుందన్నారు. ఆ తర్వాత అన్న దాన కార్యక్రమం ఉంటుందని తెలిపారు.



పౌర హక్కుల దినోత్సవం లో మాట్లాడుతున్న పలుగుచెరువు మహేష్

## ఉప్పర్‌పల్లిలో పౌర హక్కుల దినోత్సవం

**బుద్వేల్, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం)**

రాజ్యాంగం పౌరులకు కల్పించిన హక్కులపై ప్రతి ఒక్కరు అవగాహన కలిగి ఉండాలని రాజేంద్రనగర్ డిప్యూటీ తహసీల్దార్ ఆనంద్ అన్నారు. అత్తాపూర్ సర్కిల్ ఉప్పర్పల్లి లో శనివారం పౌరహక్కుల దినోత్సవం నిర్వహించారు. ఈ సం దర్భంగా కార్యక్రమంలో పాల్గొన్న నాయకులతో అనంద్ మాట్లాడుతూ, కుల వివక్ష లేకుండ ప్రతి ఒక్కరు సోదర భావంతో కలసి మెలసి ఉండాలన్నారు. పౌర హక్కులకు భంగం కలిగిస్తే కఠిన చర్యలు ఉంటాయన్నారు. పౌరుల రక్షణ కోసమే హక్కులు ఉన్నాయని, పౌరులు తమ హక్కులను కాపాడుకోవాలన్నారు. పౌరహక్కుల పై ప్రజలు అవగాహన కలిగి ఉండాలని కాం గ్రెస్ పార్టీ నాయకులు పలుగుచెరువు మహేశ్ అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ ఇన్స్పెక్టర్ సరిత, ఎస్ఐ భాను ప్రకాశ్, రాజేంద్రనగర్ ఎస్సీ బాలుర వసతి గృహం వార్డెన్ హర్షద్, రెవెన్యూ సిబ్బంది సాంబ రాజు, శ్రీశైలం, స్థానిక నాయకులు జగన్, శ్రీనివాస్, మంగలారం శ్రీనివాస్, మోహన్, యాదయ్య, వెంకటేశ్, మహేందర్, విశాల్, సుభాష్, కిరణ్, సాయి, రామచరణ్, తదితరులు పాల్గొన్నారు.

# రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో ఘనంగా సైన్స్ డే వేడుకలు

**బుద్వేల్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):**

రాజేంద్రనగర్, అత్తాపూర్ సర్కిళ్లలలో శనివారం సైన్స్ దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలో జాతీయ సైన్స్ డే సందర్భంగా వైజ్ఞానిక ప్రదర్శనలు, భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ సీవీ రామన్ జయంతి వేడకలు నిర్వహించారు.

**బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో..**

జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం వైజ్ఞానిక ప్రదర్శన ను నిర్వహించారు. విద్యార్థుల ఆలోచనలతో చేపట్టిన పలు ప్రాజెక్టులు చూపరులను ఎంతగానో ఆకట్టుకున్నాయి. విద్యార్థులకు క్విజ్, రంగోళీ, ఇతర పోటీలను నిర్వహించి గెలుపొందిన వారికి బహుమతులు అందజేశారు. సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకుని సైన్స్ ఉపాధ్యాయులను ఇంచార్జి హెడ్మాస్టరు శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు ఖలీద్, రూహీ, సుష్మ, సత్తయ్య గౌడ్, అశోక్ గౌడ్,



బుద్వేల్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ ఉపాధ్యాయులను సన్మానిస్తున్న సహచర ఉపాధ్యాయులు

హసనుద్దీన్ లు పాల్గొన్నారు.

**అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో....**

సైన్స్ దినోత్సవం సందర్భంగా అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో భౌతిక శాస్త్రవేత్త, నోబెల్ బహుమతి గ్రహీత డాక్టర్ సీవీ రామన్ జయంతి వేడుకలను నిర్వహించారు. పాఠశాలకు చెందిన సైన్స్ ఉ పాధ్యాయులు సాయి ప్రసాద్రావు, సుజాత, రోజా రాణి, అనిత ల ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. పాఠశాల



భౌతిక శాస్త్ర వేత్త సీవీ రామన్ చిత్ర పటానికి నివాళులు అర్పిస్తున్న అత్తాపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల అధ్యాపకులు

ప్రధానోపాద్యాయురాలు శ్రీలత అధ్యక్షతన జరిగిన సమావేశంలో సీవీ రామన్ సేవలను కొనియాడుతు మాట్లాడారు. విద్యార్థులకు క్విజ్, రంగోళి పోటీలను నిర్వహించి బహుమతులు అం దజేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు రంగారెడ్డి, శ్రీనివాస్ సాగర్, జకీరా బేగం, జ్యోతి, హేమలత, కమలమ్మ, కవిత తదితరులు పాల్గొన్నారు.



రాజేంద్రనగర్ లో జరిగిన ఇఫ్తార్ విందు లో పాల్గొన్న ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ...


అసదుద్దీన్ ఓవైసీ ని సన్మానిస్తున్న మహ్మద్ మూర్తుజా అలీ

## రాజేంద్రనగర్‌లో జరిగిన ఇఫ్తార్ విందులో పాల్గొన్న అసదుద్దీన్ ఓవైసీ

**బుద్వేల్, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

మజ్లిస్ పార్టీ నాయకులు మహ్మద్ ముర్తుజా అలీ ఆధ్వర్యంలో శనివారం రాజేంద్రనగర్ లో జరిగిన ఇఫ్తార్ విందు లో మజ్లిస్ పార్టీ అధ్యక్షులు, హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఓవైసీ పాల్గొన్నారు. ఇఫ్తార్ విందులో వందల సంఖ్యలో ముస్లీం సోదరులు పాల్గొని ప్రార్థనలు చేశారు. అనంతరం ఇఫ్తార్ లో పాల్గొన్నారు. కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు మీర్జా రహ్మత్ బేగ్, మజ్లిస్ నాయకులు నవాజుద్దీన్, తదితరులు పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందు లో పాల్గొన్న ముస్లిం సోదరులు

## షెడ్డు నిర్మాణం జరుగకుండ చర్యలు తీసుకోవాలి



డిప్యూటీ కమిషనర్ బి సురేందర్ రెడ్డి కి వినతి పత్రం అందచేస్తున్న గగన్ పహాడ్ దళిత బస్తీ ప్రజలు

**బుద్వేల్, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ సర్కిల్ గగన్ పహడ్ దళిత బస్తీలో నివాసాలకు ఆనుకుని భారీ షెడ్డు వేస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరుతు శనివారం గగన్ పహడ్ కు చెందిన పలువురు నాయకులు రాజేంద్రనగర్ సర్కిల్ డిప్యూటీ కమిషనర్ బి సురేందర్రెడ్డి ని కలసి వినతి పత్రం అందజేశారు. జనావాసాల మధ్య ప్యాక్టరీ షెడ్డులు వేయడం వల్ల ప్రజలకు ఇబ్బందులు కలుగుతాయన్నారు. డిప్యూటీ కమిషనర్ ను కలసిన వారిలో స్థానిక నాయకులు తలారి శ్రీరాములు, ఎర్రోళ్ల యాదయ్య, సరికొండ దుర్గేశ్, తలారి ఈశ్వరయ్య. తలారి రత్నం తదితరులు ఉన్నారు.



# ఘనంగా సంత్ సేవా లాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు


**యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడవాలి**

**సంత్ సేవా లాల్ ఆశయాలు నేడు యువతకు మార్గదర్శకం**

**ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**



మాట్లాడుతున్న లక్ష్మీనారాయణ నాయక్

సంత్ సేవాలాల్ మహారాజ్ 287వ జయంతి వేడుకలు ఆధ్యాత్మిక భక్తి శ్రద్ధలతో శనివారం ఘనంగా జరిగాయి. ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడిగా డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ వ్యవహ రించగా, సభ అజ్మీరా స్వామి నాయక్ అధ్యక్షతన జరిగింది. నెహ్రూ పార్క్ నుండి జూబ్లీ ఫంక్షన్ హాల్ వరకు సంప్రదాయ నృత్యాలు, వస్త్రధారణతో ర్యాలీ నిర్వహించారు. అనంతరం జూబ్లీ ఫంక్షన్ హాల్‌లో బోగ్ బండారం కార్యక్రమం జరిగింది. జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి, టీపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్, జనగామ ఆర్డీవో గోపీరామ్ పాల్గొని బోగ్ బండారు కార్యక్రమాన్ని నిర్వహించి అనంతరం సేవాలాల్ మహారాజ్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. ఈ సందర్భంగా స్థానిక ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్ రెడ్డి గిరిజన సోదర సోదరీ మణు లకు సంత సేవాలాల్ జయంతి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంత్ సేవాలాల్ ఆశయాలు అందరికీ ఆదర్శమని యువత చెడు అలవాట్లకు బానిసలు కాకుండా సన్మార్గంలో నడవాలని కోరారు. బంజారాల అభివృద్ధికి తాను పాటు పడతానని హామీ ఇచ్చారు. అనంతరం ఉత్సవ కమిటీ గౌరవ అధ్యక్షుడు టీపీసీసీ మెంబర్ డాక్టర్ లక్ష్మీ నారాయణ నాయక్ మాట్లాడుతూ 287 సంవత్సరాల క్రితం ఎలాంటి చదువు, సాంకేతిక పరిజ్ఞానం అందుబాటులోకి లేని సమయం లో సంత్ సేవా లాల్ సంచార జాతులుగా జీవించిన బంజారాలు స్థిర నివాసం ఏర్పరచుకొని, శాఖాహారం అలవాటు చేసుకుని, మద్య పానంను దూరంగా ఉంచి, వ్యవసాయాన్ని ఆధారంగా జీవించాల్సిన అవసరం ఉందని, జాతి ఐక్యతే అభివృద్ధికి మూల మని ఆయన వివరించారు. తెలంగాణ ఉద్యమంలో ముందుగా నిలిచిన బంజారా సమాజం, నేటి పరిస్థితుల్లో తమ జాతి ప్రయోజనాల కోసం మరింత ఐక్యంగా పోరాటం చేయాల ని పిలుపునిచ్చారు. దేశ వ్యాప్తంగా ఉన్న బంజారా ప్రజలు తమ భాష, సంప్రదాయ వేషధారణను పరిరక్షించు కోవాలని సూచించారు. జాతి ఐక్యంతో ఎలాంటి లక్ష్యాలైన సాధ్యమన్నారు. జనగామ లో బంజారా భవన్ నిర్మాణం, ఠాణు నాయక్ విగ్రహం ఏర్పాటు చేయాలని తెలిపారు. యువత సేవా లాల్ మహారాజ్ ఆశయా లను ఆదర్శంగా తీసుకొని సమాజ అభివృద్ధి, సేవా కార్యక్ర మాల్లో ముందుండాలని, సామా జిక ఐక్యతను కాపాడాలని పిలుపు నిచ్చారు. సభాధ్యక్షుడు స్వామి నాయక్ మాట్లాడుతూ ప్రభుత్వాలు బంజారాలను కేవలం ఓటు బ్యాంకుగా కాకుండా, వారి సమగ్ర అభివృద్ధి కోసం చిత్త శుద్ధితో పని చేయాల న్నారు. ఈ సందర్భంగా జనగామ నూతన మున్సిపల్ చైర్మన్ కడకంచి బాలమణి శ్రీనివాస్ దంపతులను సన్మానం చేశారు. పట్టణంలో బంజారాల సమస్య లపై ప్రత్యేక దృష్టి పెట్టాలని కోరారు.

**బంజారా ప్రజా ప్రతినిధులకు సన్మానం**

జిల్లాలోని మూడు నియోజక వర్గాల పరిధిలోని దాదాపు 100 మంది బంజారా సర్పంచ్‌లను డాక్టర్ లక్ష్మీ నారాయణ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో గోపీరామ్, ఎమ్మార్వో, గాంధీ నాయక్, మూడ్ లక్ష్మణ్ నాయక్, మూడావత్ సంపత్ నాయక్, బిక్షపతి నాయక్, సుమన్ నాయక్, వాంకుడోతు అనిత, కొర్ర రాజేంద్ర నాయక్, భూక్య జుమ్లాల్ నాయక్, భూక్య జయరాం నాయక్, కోటి, ధారావత్ రాజు నాయక్, బానోత్ వెంకటేష్, కమిటీ నాయకులు, స్థానిక ప్రజా ప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు, సర్పంచ్‌లు పెద్ద సంఖ్యలో అభిమానులు పాల్గొన్నారు.



ఎంపీవో కు వినతిపత్రం ఇస్తున్న ఎంఆర్పిఎస్ నాయకులు

## మంచుప్పుల సర్పంచ్ భర్త, ఉపసర్పంచ్, గ్రామ కార్యదర్శి పైన చర్యలు తీసుకోవాలి

**ఎంఆర్పిఎస్ డిమాండ్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం):**

జిల్లా లోని పాలకుర్తి మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఎంఆర్పిఎస్ ఆధ్వర్యంలో ఎంపీవో ని కలిసి మంచుప్పుల గ్రామ పంచాయతీ ఆవరణలో వార్డు సభ్యుని పై జరిగిన దాడిని ఖండిస్తూ దానిపై పూర్తి విచారణ చేసి సర్పంచ్ బొలగాల కల్పన భర్త బొలగాల శ్రీనివాస్, ఉప సర్పంచ్ దాసరి ఉప్పలయ్య, గ్రామ కార్యదర్శి ల పై తగు చట్ట పరమైన చర్యలు తీసుకోవాల్సిందిగా వినతిపత్రం శనివారం ఇచ్చారు. ఈ కార్యక్రమం లో ఎంఆర్పిఎస్ జిల్లా నాయకులు చెరిపెల్లి యాదగిరి స్వామి, మండల అధ్యక్షులు దండు రామచంద్రు తదితరులు పాల్గొన్నారు.

## జిల్లా న్యాయమూర్తిని మర్యాదపూర్వకంగా కలిసిన నూతన కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం)**

గద్వాలలోని కోర్టు సముదాయాన్ని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ జిల్లా, సెషన్స్ జడ్జి, అదనపు జిల్లా , సెషన్స్ జడ్జి (ఎఫ్ ఏసి) ఎస్. రవికుమార్ ను ఆయన ఛాంబర్ లో జిల్లా కలెక్టర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జోగులాంబ గద్వాల జిల్లా నూతన కలెక్టర్ గా బాధ్యతలు స్వీకరించిన రిజ్వాన్ బాషా షేక్ కు ఈ సందర్భంగా న్యాయమూర్తి రవికుమార్ శుభాకాంక్షలు తెలిపారు.



టీజీ ఎస్పీడీసీఎల్ నూతన సీఎండి జితేష్ వి పాటిల్ కు పుష్పగుచ్చం అందజేస్తున్న విద్యుత్ అకౌంట్స్ ఆఫీసర్ అసోసియేషన్ ప్రతినిధులు మురళి గౌడ్, కృష్ణయ్య

## వంద శాతం ఫలితాలతో సత్తా చాటాలి

**కలెక్టర్ రిజ్వాన్ భాష షేక్**

**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28(ప్రభాత ఉదయం)**





పదో తరగతి పబ్లిక్ పరీక్షల్లో విద్యార్థులు ప్రతిభ చాటి వంద శాతం ఫలితాలు సాధించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ పిలుపునిచ్చారు. శనివారం జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని గద్వాల ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో విద్యార్థులు ఏర్పాటు చేసిన వైజ్ఞానిక ప్రదర్శనలను కలెక్టర్ తిలకించారు. మిల్లెట్స్ తో పాటు ఇతర పౌష్టికాహారంతో కూడిన ఫుడ్ ఫెస్టివల్ ను తిలకించి విద్యార్థులను ప్రశంసించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... విద్యార్థులు ఏకాగ్రతతో చదివి పదో తరగతి పరీక్షల్లో మంచి మార్కులు సాధించాలని పేర్కొన్నారు. పరీక్షల భయం లేకుండా మానసిక ఒత్తిడిని దూరం చేసుకోవడానికి విద్యార్థులు ప్రశాంతంగా చదువుకోవాలన్నారు. వెనుకబడిన సబ్జెక్టులపై ప్రత్యేక దృష్టి పెట్టి ఏకాగ్రతతో చదివితే మంచి మార్కులు పొందేందుకు అవకాశం ఉందన్నారు. పరీక్షల సమయంలో తగినంత నిద్రపోవడమే కాక పౌష్టికాహారం తీసుకుంటే ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు. గత పరీక్షల్లోని ప్రశ్నాపత్రాలను పరిశీలించి పునశ్చరణ చేసుకుంటే పరీక్షలపై మంచి అవగాహన వస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానాచార్యులు జహురుద్దీన్,ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.



కూకట్‌పల్లి జోనల్ కమిషనర్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న అంజనగర్ డివిజన్ నాయకులు

## అంజయ్య నగర్ మెయిన్ రోడ్డుపై ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మించాలి: ఆంజనేయులు సాగర్

**శేరిలింగంపల్లి : ఫిబ్రవరి 28, ( ప్రభాత ఉదయం)**

అంజయ్య నగర్ డివిజన్ పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి ప్రధాన రహదారిపై పాదచారులు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఫుట్ ఓవర్ బ్రిడ్జ్‌ను అత్యవసరంగా నిర్మించాలని అంజయ్య నగర్ డివిజన్ నాయకులు ఆంజనేయులు సాగర్ విజ్ఞప్తి చేశారు. సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని కుకట్‌పల్లి జోనల్ కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం సమర్పించారు. పెరుగుతున్న ట్రాఫిక్ కారణంగా ముఖ్యంగా విద్యార్థులు, మహిళలు, వృద్ధులు రహదారి దాటడం కష్టసాధ్యంగా మారిందని నిత్యం అనేక ప్రమాదాలు జరుగుతున్నాయని వివరించారు. ప్రధానంగా అంజయ్య నగర్, సిద్దిక్ నగర్, బంజారా నగర్ కాలనీ వాసులు చాలా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని విన్నతి పత్రం చెప్పారు. ఈ ప్రాంతంలో రోడ్డు విస్తరణ పనులు చేపట్టే ఆలోచన ఉన్న నేపథ్యంలో ఆ పనులతో పాటు ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని కూడా కలిపి చేపట్టాలని కోరారు. ఒకవేళ రోడ్డు విస్తరణ పనులు ఆలస్యమైతే ప్రజల భద్రత దృష్ట్యా ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణాన్ని అత్యవసరంగా ముందుగా చేపట్టాలని అధికారులను అభ్యర్థించారు. ప్రజల భద్రతను దృష్టిలో ఉంచుకుని తక్షణ స్థల పరిశీలన నిర్వహించి, వీలైనంత త్వరగా ఫుట్ ఓవర్ బ్రిడ్జ్ నిర్మాణానికి అనుమతులు మంజూరు చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు జీ. నరసింహ, సంతోష్, స్వామి, బాలపీర్ సాగర్, రాజేందర్ రెడ్డి, రాజు, గురు స్వామి, వీరేష్, విజయేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



## చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను గుర్తించాలి

**ఆసక్తి చూపుతున్న రంగాలలో వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సృష్టిస్తారు**


**పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

చిన్నారులలో దాగి ఉన్న ప్రతిభను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు వెలిగితే అద్భుతాలు సృష్టిస్తారని పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి అన్నారు. పాపిరెడ్డి నగర్ లో జాతీయ సైన్స్ దినోత్సవాన్ని పురస్కరించుకొని శనివారం రెయిన్బో హై స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణువర్ధన్ రెడ్డి, ప్రజ్ఞా హై స్కూల్ కరస్పాండెంట్ అశోక్ ప్రీతంల ఆహ్వానం మేరకు మెగా రోబోఫెస్ట్ అండ్ సైన్స్ మేళా కార్యక్రమానికి పాపిరెడ్డి నగర్ కాంటెస్టడ్ అధ్యక్షుడు చిట్టిరెడ్డి శ్రీధర్ రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం శ్రీధర్ రెడ్డి మాట్లాడుతూ ఇలాంటి కార్యక్రమాలు ప్రోత్సహించడం వలన పిల్లలు ఎంతో చురుకుగా ఉండడమే కాకుండా భవిష్యత్తులో వారికంటూ ఒక లక్ష్యాన్ని ఏర్పరచుకుంటారు అని అన్నారు. ఈ కార్యక్రమంలో చర్ల రామకృష్ణారెడ్డి, గడ్డం రాజేశ్వర్ రెడ్డి, డాకురి అక్కిరెడ్డి, బివికె శ్రీకాంత్, స్కూలు ఉపాధ్యాయులు, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



శివరాంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సైన్స్ డే సందర్భంగా భౌతిక శాస్త్ర వేత్త, నోబుల్ బహుమతి గ్రహీత సీ వీ రామన్ చిత్రాన్ని గీశారు



## నూతన వధూవరులను ఆశీర్వదించిన నాయకులు

**కొత్తకోట, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

వనపర్తి జిల్లా పెబ్బేరు మండలం తోమాల పల్లె గ్రామం కు చెందిన సుధారాణి శివరామ్ రెడ్డి ల ఏకైక పుత్రుడు ప్రణయ్ భాస్కర్ రెడ్డి కు చిన్న వాడేమాన్ చిన్న చింతకుంట మండలం పుచ్చకాయల కవిత దివాకర్ రెడ్డి ఏకైక పుత్రిక కీర్తి రెడ్డి తో వివాహం జరిగింది. ఈ వివాహ రిసెప్షన్ వేడుక వనపర్తి కళ్యాణ సాయి గార్డెన్ లో వైభవంగా జరిగింది .ఈ కార్యక్రమంలో అడ్డాకుల్ మాజీ ఎంపీపీ దంపతులు డి నాగార్జునరెడ్డి భాగ్యమ్మ ,వనపర్తి జిల్లా సీనియర్ నాయకులు మూలమళ్ళ భీమ్ రెడ్డి , డిప్యూటీ యం ఆ ర్ ఓ అశోక్ , కోపరేటివ్ మాజీ డైరెక్టర్ ఎమ్ చక్ర గిరి వర్ధన్ రెడ్డి, సంగినై పల్లి నరసింహ రెడ్డి నాయకులు యం యుగంధర్ రెడ్డి కే జగతి లువధువు వరులు, కుటుంబ సభ్యులకు శుభా కాంక్షలు తెలిపి ఆశీర్వదించారు





## ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జాతీయ సైన్స్ దినోత్సవము

**శేరిలింగంపల్లి : ఫిబ్రవరి 28, (ప్రభాత ఉదయం)**

శేరిలింగంపల్లి ప్రభుత్వ డిగ్రీ కళాశాలో( బెల్ ) జాతీయ సైన్స్ దినోత్సవ వేడుకలను ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా నోబెల్, భారతరత్న బహుమతుల గ్రహీత సర్ సీవీ రామన్ చిత్రపటానికి పుష్పాంజలి ఘటించి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఏ. కవిత అధ్యక్షత వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హైదరాబాదు సెంట్రల్ యూనివర్శిటీ భౌతికశాస్త్ర ఆచార్యులు జీ. వెంకటయ్య విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగిస్తూ జాతీయ సైన్స్ దినోత్సవాన్ని దేశలోని పాఠశాలలు, కాలేజీలు, విశ్వవిద్యాలయాలు పరిశోధన సంస్థలలో 1987 నుండి ప్రతి సంవత్సరము ఒక నినాదంతో నిర్వహించుకుంటున్నామ అన్నారు. ఈ సంవత్సరం విజ్ఞానశాస్త్రంలో ప్రజలకు విశ్వాసాన్ని పెంపొందించడం అనే నినాదంతో నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ప్రముఖ శాస్త్రవేత్త సీవీ రామన్ చేసిన కాంతి ఒక పదార్థంపై పడినపుడు ఆ పదార్థంలోని అణువులతో పరస్పర చర్యలవల్ల కాంతి తరంగ ధైర్యంలో జరిగే మార్పు. ఈ మార్పు ఆధారంగా శాస్త్రవేత్తలు ఆ పదార్థం యొక్క రసాయన నిర్మాణం లక్షణాలను తెలుసుకోవచ్చు అని తెలిపారు. ఈ సూత్రము ఆధారంగా అభివృద్ధి చెందిన రామన్ స్పెక్ట్రోస్కోపీ పద్ధతి, రసాయన శాస్త్రం, వైద్య శాస్త్రం, నానో టెక్నాలజీ తోపాటు ఫార్మాస్యూటికల్ పరిశోధనలలో విస్తృతంగా ఉపయోగ పడుతుందని తెలిపారు. ప్రజలలో శాస్త్రీయ అవగాహన పెంపొందించడం యువతను శాస్త్ర సాంకేతిక రంగాలలో కెరీర్ల వైపు ప్రోత్సహించడం, శాస్త్రీయ దృక్పథం హేతుబద్ధమైన ఆలోచనలను అభివృద్ధి చేయడం దేశం యొక్క శాస్త్రీయ పురోగతిని ప్రజలకు పరిచయం చేయడం లాంటివి“ అని అన్నారు. సర్ సీవీ రామన్ గొప్ప భౌతికశాస్త్ర వేత్త. కాంతి పరిక్షేపంపై చేసిన పరిశోధలకు 1930లో నోబెల్ బహుమతిని పొందారని చెప్పారు. నోబెల్ బహుమతిని పొందిన వారిలో ఆశియాలోనే మొదటి భౌతికశాస్త్రవేత్త అన్నారు. ఆయన చిన్నతనం నుండి తెలివైన విద్యార్థి. భౌతికశాస్త్రం పట్ల మక్కువ చూపేవారని మెట్రిక్యులేషన్ లో గోల్డ్ మెడల్ సాధించడం తోపాటు ఎమ్మెస్సీ ఫిజిక్స్ లో విశ్వవిద్యాలయంలోనే మొదటి వ్యక్తిగా నిలిచారని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్య ప్రకాష్ , సైన్స్ అధ్యాపకులు అనురాధ, జ్యోతిర్మయి తోపాటు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు శివరామకృష్ణ, అమ్మయ్య చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# భూ భారతి పేరుతో భారీ కుంభకోణం..!

**పేరు మార్చి ప్రజలను మోసం చేస్తున్నారు... భూ భారతి స్లాట్ బుకింగ్‌లో భారీ అవకతవకలు జరిగాయి...**

**పూర్తి ఫీజు చెల్లించిన రైతులకే నోటీసులు జారీ చేశారు...**

**కిందస్థాయి నుంచి పైస్థాయి అధికారుల వరకు దర్యాప్తు చేయాలి...**

**రోజుకు నాలుగు ఐదు గంటలే విశ్రాంతి తీసుకుంటూ ప్రజల కోసం హరీష్ రావు పోరాటం...**

**దేవాదుల నీళ్ల అంశంలో ప్రభుత్వాన్ని కదిలించిన హరీష్ రావు...**

**నిరంతరం ప్రజల న్యాయం కోసం పోరాటం బిఆర్ఎస్ కొనసాగుతుంది...**

**జనగామ ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డి**

**జనగామ జిల్లా ప్రతినిధి , ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**



విలేకరుల సమావేశం లో మాట్లాడుతున్న హరీష్ రావు

జనగామ జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మీడియా సమావేశానికి ముఖ్య అతిథిగా బీఆర్ ఎస్ పార్టీ అసెంబ్లీ డిప్యూటీ ఫ్లోర్ లీడర్ తన్నీరు హరీష్ రావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... భూ భారతి వ్యవస్థ, రైతుల సమస్యలు, రాష్ట్ర ప్రభుత్వ విధానాలపై జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి, మాజీ మంత్రి తాటికొండ రాజయ్య, మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్ రెడ్డి, మాజీ ఎస్సి కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ తో కలిసి తీవ్ర విమర్శలు చేశారు.

**-పేరు మార్పే తప్ప విధానం మారలేదు:**

ధరణి పేరుతో అమలు చేసిన సాఫ్ట్‌వేర్‌ను కేవలం పేరు మార్చి భూ భారతిగా కొనసాగిస్తున్నారని విమర్శించారు.

వ్యవస్థలో ఎలాంటి మౌలిక మార్పులు చేయకుండా ప్రజలను మోసం చేయడం సరైంది కాదని. రాష్ట్ర ప్రజలు నిజమైన మార్పును ఆశించారని, కానీ ప్రభుత్వం కేవలం పేరును మాత్రమే మార్చిందని వ్యాఖ్యానిం చారు. సీఎం రేవంత్ రెడ్డి, రెవిన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అహంకార ధోరణితో మాట్లాడటం తగదన్నారు.

**ప్రజల సమస్యలపై హరీష్ రావు నిరంతర పోరాటం:**

తెలంగాణ ఉద్యమం నాటి నుంచి ప్రజా సమస్యల పరిష్కారంలో ముందుండే నాయకుడు తన్నీరు హరీష్ రావు అని ఎమ్మెల్యే పల్లా పేర్కొన్నారు. రోజుకు నాలుగు నుంచి ఐదు గంటలే విశ్రాంతి తీసుకుంటూ మిగతా సమయాన్ని ప్రజల సమస్యల పరిష్కారానికే కేటాయి స్తున్నారని తెలిపారు. గత రెండేళ్లుగా రాష్ట్రంలో ఏ సమస్యైనా ఆయన దృష్టికి వెళ్లకుండా లేదు. వరంగల్ జిల్లాకు వారం రోజుల్లో మూడుసార్లు రావడం ఆయన ప్రజలపై ఉన్న నిబద్ధతకు నిదర్శనమని చెప్పారు.

**దేవాదుల నీటి అంశంలో ప్రభుత్వాన్ని కదిలించిన హరీష్ రావు పోరాటం:**

దేవాదుల ప్రాజెక్టు నీళ్లు వరంగల్‌కు అందడం లేదని ప్రజలు ఫిర్యాదు చేయగానే హరీష్ రావు వెంటనే స్పందించి ప్రెస్‌మీట్ నిర్వహించి ప్రభుత్వాన్ని నిలదీశారని చెప్పారు. ఆయన పోరాటం వల్లే ప్రభుత్వం సమీక్ష సమావేశాలు నిర్వహించాల్సి వచ్చిందని పేర్కొన్నారు.

**హెల్త్ మినిస్టర్‌గా ఉత్తర తెలంగాణ అభివృద్ధి లక్ష్యం:**

హరీష్ రావు ఆరోగ్యశాఖ మంత్రిగా ఉన్న సమయంలో ఆదిలాబాద్ నుంచి ఖమ్మం వరకు ఆధునిక వైద్య సేవలు అందించాలనే లక్ష్యంతో 24 అంతస్తుల సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్, హెల్త్ సిటీ ఏర్పాటు కోసం కృషి చేశామని. ఎన్నికల ముందు పూర్తి చేయాలని భావించిన పనులు కొన్ని అడ్డంకుల వల్ల ఆగిపోయినా ఇప్పటికీ వాటిని పూర్తి చేయడానికి ప్రయత్నిస్తున్నారని చెప్పారు.

**కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీపై కూడా పోరాటం:**

కాజీపేట్ కోచ్ ఫ్యాక్టరీ సమస్యపై కూడా ప్రజల తరఫున పోరాటానికి సిద్ధమవుతున్నారని, ప్రజా సమస్యలపై పోరాటమే ఆయన ధ్యేయమని ఎమ్మెల్యే అన్నారు.

**భూ భారతి వ్యవహారంలో భారీ అవకతవకలు:**

జనగామలో భూ భారతి వ్యవహారంలో పెద్ద ఎత్తున అవకతవకలు వెలుగుచూస్తున్నాయని స్లాట్ బుకింగ్ సమయంలో రైతులు పూర్తి రిజి స్ట్రేషన్ ఫీజు చెల్లించినప్పటికీ సిస్టమ్‌లో కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే నమోదు చేసి, మిగిలిన మొత్తం అధికారులు, మీసేవ నిర్వా హకులు, బ్రోకర్లు కుమ్మక్కై దారి మళ్లించినట్లు ఆగ్రహం వ్యక్తం చేశారు.

తహసీల్దార్ కార్యాలయంలో కూడా వెయ్యి రూపాయలే నమోదు అయి నప్పటికీ మ్యూటేషన్, డాక్యుమెంటేషన్ పూర్తి చేయడం ప్రజల్లో అను మానాలకు తావిస్తోందని. కిందస్థాయి సిబ్బంది నుంచి పైస్థాయి అధికారుల వరకు ఈ వ్యవహారం జరిగిందా? అనే అనుమానాలు ప్రజల్లో వ్యక్త మవుతున్నాయని చెప్పారు.

**రైతులపైనే భారం వేయడం అన్యాయం:**

ఈ వ్యవహారంపై వేలాది ఫిర్యాదులు వచ్చాయి. ఇప్పటికే కొంతమంది మీసేవ నిర్వాహకులు, బ్రోకర్లను అరెస్ట్ చేసినప్పటికీ అసలు నష్టపో యింది రైతులేనన్నారు. ఇప్పుడు రైతులకు మిగిలిన డబ్బులు చెల్లిం చాలని నోటీసులు ఇవ్వడం పూర్తిగా అన్యాయమని మండిపడ్డారు.

సమావేశాలకు రాకపోతే డబ్బులు వసూలు చేస్తామని బెదిరింపులు చేస్తున్నారని రైతులు తమ వద్దకు వచ్చి వేదన వ్యక్తం చేస్తున్నారు.

**సమగ్ర దర్యాప్తు చేయాలని డిమాండ్:**

పూర్తి డబ్బులు చెల్లించకుండా తహసీల్దార్ కార్యాలయానికి ఫైళ్లు ఎలా వచ్చాయో..సిస్టమ్‌లో తక్కువ మొత్తం చూపిస్తూ మ్యూటేషన్ ఎలా పూర్తయ్యిందో ప్రభుత్వం సమగ్రంగా దర్యాప్తు చేయాలని ఎమ్మెల్యే పల్లా డిమాండ్ చేశారు. అవినీతికి పాల్పడిన అధికారులపై కఠిన చర్యలు తీసుకోవాలని. రైతులకు జారీ చేసిన నోటీసులను వెంటనే ఉపసంహరించుకోవాలని కోరారు. రైతుల హక్కులను కాపాడే వరకు బీఆర్ఎస్ పార్టీ పోరాటం కొనసాగుతుందని ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి స్పష్టం చేశారు.



మహేష్‌ను ఓదార్చుతున్న ఎర్రబెల్లి

## కడవెండిలో తాటిపెల్లి మహేష్ కుటుంబాన్ని పరామర్శించిన మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

జిల్లాలోని దేవరుప్పుల మండలం,కడవెండి గ్రామ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు తాటిపెల్లి మహేష్ తండ్రి తాటిపెల్లి కొమురయ్య అనారోగ్యం వలన హైదరాబాద్ నిమ్స్ హాస్పిటల్లో శనివారం మరణించారు. విషయం తెలుసుకొన్న మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు హాస్పిటల్లో కొమురయ్య భౌతిక దేహానికి పూలమాల వేసి నివాళులు అర్పించి, కుటుంబానికి ప్రగాఢ సంతాపం తెలిపారు. కుటుంబ సభ్యులు ధైర్యంగా ఉండాలని ధైర్యం చెప్పారు.



## బొల్లారం పబ్లిక్ స్కూల్లో ఘనంగా సైన్స్ డే వేడుకలు

**పటాన్ చెరు, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):**

సైన్స్ డే ను పురస్కరించుకుని బొల్లారం పబ్లిక్ స్కూల్లో శనివారం సైన్స్ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో మాజీ కౌన్సిలర్ వేణుపాల్ రెడ్డి, బొల్లారం డివిజన్ బిజెపి అధ్యక్షుడు ఆనంద్ కృష్ణా రెడ్డి , కాంగ్రెస్ యువనేత వి.ప్రవీణ్ రెడ్డి ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. సైన్స్ డే సందర్భంగా విద్యార్థులు తయారుచేసిన వినూత్న ప్రాజెక్టులను ఆయన తిలకించారు. సి.వి రామన్ జన్మదినాన్ని సైన్స్ డే గా నిర్వహించడం జరుగుతుందని వారు అన్నారు. సైన్స్ ఆవశ్యకత, ప్రాధాన్యత పట్ల విద్యార్థులు ఆసక్తిని కనబరుస్తున్నారని అన్నారు. పరికరాల ఉపయోగం వాటి సద్వినియోగం అంశాలను కళ్లకు కట్టినట్లుగా ప్రదర్శించిన విద్యార్థుల మేదో శక్తిని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు ప్రభు కుమార్, పాఠశాల సిబ్బంది, పత్రికా ప్రతినిధులు శ్రీనివాస్ రెడ్డి, రామకృష్ణ, శేఖర్, నర్సింహారెడ్డి, కిషోర్ వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.



అక్రమ నిర్మాణాలపై గతంలో ఫిర్యాదు చేసిన స్థానికుడు అగ్రహారం శ్రీనివాస్ ( ఫైల్ ఫోటో)

## ప్రభుత్వ భూమి సర్వే నెంబర్ 10లో అక్రమ వే బ్రిడ్జి నిర్మాణం

**నిర్మాణాల దశ నుంచే ఫిర్యాదుల పర్వం**

**పట్టించుకోని రెవెన్యూ యంత్రాంగం**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):**

జిన్నారం మండల పరిధిలోని గడ్డపోతారం మున్సిపల్ ప్రాంతంలోని సర్వేనెంబర్ 10 ప్రభుత్వ భూమిలో అక్రమంగా వే బ్రిడ్జి నిర్మాణం చేపడుతున్నారని ఫిర్యాదులు అందుతున్నా రెవెన్యూ అధికారులు స్పందించకపోవడం పలు అనుమానాలను రేకెత్తిస్తుంది. అక్రమంగా ప్రభుత్వ భూమిలో వే బ్రిడ్జి నిర్మాణం చేపట్టినా రెవెన్యూ అధికారులు నిద్ర నటిస్తున్నారని అనేక ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమంగా వే బ్రిడ్జి నిర్మాణం చేస్తున్నారని ,ఆ నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని గత నెలలో గ్రామస్తుడు అగ్రహారం శ్రీనివాస్ తాసిల్దార్ కార్యాలయంలో డిప్యూటీ తాసిల్దార్,జిల్లా కలెక్టర్,ఆర్డీవోకు కలిసి ఫిర్యాదు చేసిన సంగతి తెలిసిందే. దీంతో కలెక్టర్ స్పందించి అక్రమ వే బ్రిడ్జి నిర్మాణంపై చర్యలు తీసుకోవాలని తాసిల్దార్ కు సూచించినట్లుగా తెలుస్తోంది. కాగా రెవెన్యూ అధికారులు పూర్తిగా పట్టించుకోకపోవడంతో ప్రభుత్వ భూమిలో అక్రమార్కులు యదేచ్ఛగా వే బ్రిడ్జి నిర్మాణం పూర్తి చేశారు. ఈ నిర్మాణాలకు రెవిన్యూ కార్యాలయంలో ఓ అధికారి పూర్తిగా సహకరించారని బహిరంగ ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఇప్పటికైనా రెవిన్యూ అధికారులు స్పందించి అక్రమంగా నిర్మించిన వే బ్రిడ్జి నిర్మాణాలపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.



## 43 సంవత్సరాల అంకిత భావం

**ఎస్ ఐ దశరథ్ పదవీ విరమణకు ఘన సత్కారం**

**పటాన్ చెరు, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం):**

43 సంవత్సరాల పాటు ఎస్ ఐ దశరథ్ లాంటి అధికారుల అంకితభావంతో కూడిన సేవల వల్లనే పోలీసు వ్యవస్థ పట్ల ప్రజల్లో విశ్వాసాన్ని మరింత పెంచుతుందని సైబరాబాద్ ఆడిషినల్ డిసిపి ఉదయ్ రెడ్డి అన్నారు. బొల్లారం పోలీస్ స్టేషన్ సబ్ ఇన్స్పెక్టర్ బి దశరథ్ ఉద్యగ విరమణ సత్కార సభలో ఆయన పాల్గొని ప్రసంగించారు. స్థానిక సూర్య దేవర ఫంక్షన్ హాల్ లో శనివారం పదవీ విరమణ వీడ్కోలు సభ ఏర్పాటు చేసారు. బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ ఎం రవీందర్ రెడ్డి , పోలీస్ సిబ్బంది సహకారంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. సవాళ్లతో కూడుకున్న పోలీసు ఉద్యోగంలో ఆయన చూపిన నిబద్ధత, ధైర్యం, నిజాయితీ అనుకరణీయం“ అని రామచంద్రాపురం ఎసిపి శ్రీనివాస్ ప్రశంసించారు. ఈ సందర్భంగా బొల్లారం పోలీస్ ఇన్స్పెక్టర్ రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఎస్ ఐ దశరథ్ అందుకున్న సేవా పురస్కారం, రివార్డుల గురించి చెబుతూ,తన సహోద్యోగి గా దశరథ్ అందించిన సేవలను కొనియాడారు. తాను కుడి భుజం కోల్పోయినట్లు అనిపిస్తుందని భావోద్వేగ స్వరంతో అన్నారు. పదవీ విరమణ పొందిన సబ్ ఇన్స్పెక్టర్ దశరథ్ మాట్లాడుతూ తనకు 43 సంవత్సరాల సుదీర్ఘ కాలం పాటు పోలీసు సేవలు అందించేందుకు కుటుంబ సభ్యుల సహకారంతో పాటు సహోద్యోగుల సహకారం మరువలేనిదని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆయనకు పలువురు నాయకులు, స్థానికులు పుష్పగుచ్ఛం, శాలువా, స్మారక చిహ్నాలతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ ఐ దశరథ్ సతీమణి, కుటుంబ సభ్యులు, పోలీస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



## అర్హులైన పేదలకు ఇండ్ల స్థలం, ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తాం

**మంత్రి పొంగులేటి**

**హామీ హర్షం ప్రకటించిన లింగాల రవికుమార్**

**ఖమ్మం, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

ఖమ్మం జిల్లా వెలుగుమట్ల సమీపంలో భూధాన్ బోర్డు భూముల్లో నిరాశ్రయులైన అర్హులైన పేదలందరికీ ఇండ్ల స్థలం ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇస్తామని రాష్ట్ర రెవెన్యూ గృహ నిర్మాణ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డిప్రకటించడం పట్ల బిఆర్ అంబేద్కర్ ప్రజా సంక్షేమ సంఘం అధ్యక్షులు దళిత బహుజన సామాజిక ఉద్యమ నేత లింగాల రవికుమార్ హర్షం ప్రకటించారు.మంత్రి పొంగులేటి పేద బడుగు బలహీన వర్గాల సంక్షేమానికి వారి సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తున్నారని, మంత్రి ఆధ్వర్యంలో గ్రామీణ పట్టణ ప్రాంతాలలో నిరుపేద కుటుంబాలకు ఇందిరమ్మ ఇల్లు నిర్మిస్తున్నారని లింగాల రవికుమార్ పేర్కొన్నారు.తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఖమ్మం భూదాన్ బోర్డు భూములలో దళారుల చేతిలో మోసపోయి ఆర్థికంగా నష్టపోయిన బాధితులకు పోలీస్ అధికారుల సహకారంతో డబ్బులు ఇప్పించేందుకు కృషి చేయాలని రవికుమార్ విజ్ఞప్తి చేశారు పునరావాస కేంద్రాలలో ఇబ్బంది పడుతున్న భూధాన్ బాధితులకు అత్యంత వేగవంతంగా ఇండ్ల స్థలాలు ఇందిరమ్మ ఇండ్లు నిర్మించి ఇవ్వాలని ప్రభుత్వానికి సంబంధిత అధికారులకు లింగాల రవికుమార్ విజ్ఞప్తి చేశారు.

## ఘనంగా ధ్వజ స్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం



**గద్వాల జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 28 (ప్రభాత ఉదయం)**

ధరూర్ మండలం నీలహళ్లి గ్రామంలో శ్రీశ్రీశ్రీఈశ్వర వీరాంజనేయ స్వామి ఆలయంలో నందీ, నవగ్రహ, పలు దేవతా మూర్తుల విగ్రహాల ప్రతిష్టాపన, ధ్వజ స్తంభ ప్రతిష్టాపన కార్యక్రమం శనివారం ఘనంగా జరిగింది. ఉదయం నుంచే ఆలయంలో గణపతి పూజ, ప్రత్యేక హోమం, పూజలు నిర్వహించారు. వేదపండితుల వేద మంత్రోచ్చరణల నడుమ ధ్వజ స్తంభాన్ని ప్రతిష్టింపచేశారు. ఈ కార్యక్రమానికి బీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు, ధరూర్ మాజీ జెడ్పీటిసి పద్మావెంకటేశ్వర్ రెడ్డి బీజేపీ జిల్లా నాయకులు డికె స్నిగ్ధారెడ్డి, జిల్లా అధ్యక్షుడు రామాంజనేయులు, రాష్ట్ర కౌన్సిల్ మెంబర్ బండల వెంకట్రాములు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవికుమార్ ఎక్బోటే, కౌన్సిలర్లు, మండలాధ్యక్షుడు తిమ్మారెడ్డి, శ్రీపాదరెడ్డి, సర్పంచ్ లు , తదితరులు ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. నాయకులను గ్రామ సర్పంచ్ రంగారెడ్డి, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో శాలువాలతో ఘనంగా సన్మానించారు.